అమరధామం వద్ద మాట్లాడుతున్న తెలంగాణ పోరాట యోధులు

తొలితరం పోరాటయోధులకు పెన్షన్ అందించాలి

పరకాల, ఆగస్టు 15 : తొలితరం తెలంగాణ పోరాటయోధులందరికీ పెన్షన్ అందించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ నన్ను మాసస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని అమరధామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న 500 మంది ఉద్యమకారుల్లో 475 మంది పేర్లు మాత్రమే నయోదయ్యాయని, మిగిలిన వారి వివరాలు కూడా సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బూర నారాయణ, కోడెల ఆగయ్య, మాడుగుల అమృతరెడ్డి, బజ్జూరి వీరయ్య, మంద రాంచందర్, వావిలాల వీరయ్య, దగ్గు రాజేశ్వర్‌రావు, వెంకటరమణ, అబ్బాడి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతి బలవన్మరణం

నిఖిత (ఫైల్)

భీమదేవరపల్లి, ఆగస్టు 15 : అమ్మమ్మ తనను పట్టించుకోవడం లేదని మనస్తాపం చెంది మారుపాటి నిఖిత(22) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమదేవరపల్లిలో గురువారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మారుపాటి మహేందర్‌రెడ్డికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు నిఖిత కాకతీయ యూనివర్సిటీలో పీజీ చదువుతున్నది. నిఖిత ఆమె అమ్మమ్మ పారుపల్లి వెంకటమ్మతో ఎక్కువగా చనువుగా ఉండేది. కరీంనగర్ జిల్లా సిర్సపల్లిలో ఉన్న వెంకటమ్మ అప్పుడప్పుడూ వచ్చి నిఖితను చూసి పోయేది. కాగా కొంతకాలంగా వెంకటమ్మ ఆమెను చూసేందుకు రాకపోయేసరికి దిగాలు పడేది. అమ్మమ్మ ఎందుకు రావడం లేదని కుటుంబసభ్యులను అడిగేది. ఈ నెల 14న హనుమకొండలో పరీక్ష రాసి సాయంత్రం ఇంటికి వచ్చింది. కుటుంబసభ్యులంతా కలిసి రాత్రి భోజనం చేసిన అనంతరం నిఖిత ఆమె గదిలోకి వెళ్లిపోయింది. మరుసటి ఉదయం ఎంతకు రాకపోయేసరికి అనుమానం వచ్చి మహేందర్‌రెడ్డి వెళ్లి చూడగా గదికి లోపల గడియ పెట్టి ఉంది. గ్రామస్తుల సహాయంతో గది తలుపులు తీయడంతో నిఖిత ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఆమె చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ ఇంటికి వచ్చి మహేందర్‌రెడ్డిని ఓదార్చారు. మహేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూరు ఎస్సై నంద్రు సాయిబాబు తెలిపారు.

విద్యార్థులతో దాతలు, ఉపాధ్యాయులు

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల తోడ్పాటు

ఐనవోలు, ఆగస్టు 15 : మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు తోడ్పాటు అందిస్తున్నారు. గురువారం హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రూ.25 వేల విలువైన టీ షర్ట్స్, లోయర్స్‌ను విద్యార్థులకు అందించారు. పూర్వ విద్యార్థి మార్నేని ఉదయభాను రావు రూ.15 వేలు, సముద్రాల సమ్మయ్య రూ.10,116 నగదు, ఎలగం శ్యాం, సతీశ్ ఇండిగో కలర్ 25 లీటర్లు బహూకరించారు. పదో తరగతిలో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ. 2 వేలు, రెండో, మూడో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున మాజీ ఎంపీటీసీ, నందనం సొసైటీ డైరెక్టర్ వడిచెర్ల శ్రీనివాస్ జ్ఞాపకార్థం కుమారుడు కమల్‌హసన్ అందజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నల్లబెట్ట అనిత, ప్రభుత్వం ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బొల్లెపల్లి రమేశ్, కార్యదర్శి పుల్యాల రాజిరెడ్డి, సభ్యులు, పూర్వ విద్యార్థుల పాఠశాల అభివృద్ధి కమిటీ కన్వీనర్ అడ్డగూడి సతీశ్‌కుమార్, అధ్యక్షుడు బొల్లెపల్లి సురేశ్, కార్యదర్శి రాజారపు రాజ్‌కుమార్, మాజీ సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఎంపీటీసీ కొత్తూరి కల్పన, ఎస్ఎంసీ మాజీ చైర్మన్ బరిగెల కుమారస్వామి పాల్గొన్నారు.

రెగ్యులర్ వీసీలను నియమించాలి

నయీంనగర్, ఆగస్టు 15 : ప్రైవేట్ యూనివర్సిటీలను బలోపేతం చేయడం కోసమే ప్రభుత్వ యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించడం లేదని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, సాంబ అన్నారు. నయీంనగర్‌లో వారు మాట్లాడారు. రాష్ట్రంలో యూనివర్సిటీల పరిస్థితి దయనీయంగా మారిందని, వెంటనే రెగ్యులర్ వీసీలను నియమించాలని డిమాండ చేశారు. సమావేశంలో మిశ్రిన్ సుల్తానా, రమేశ్, గణేశ్, ధరణి, సైదులు, సుమన్, రంజిత్, కల్యాణ్, మహేశ్, గణేశ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు.
Cont: 9849145043.
NTW-318996

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి

- త్యాగధనుల పోరాట ఫలితమే దేశానికి స్వాతంత్ర్యం : మంత్రి కొండా సురేఖ
- హనుమకొండ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ జెండా ఎగురవేత
- స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం
- ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేత

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి సురేఖ, కలెక్టర్, సీపీ

హనుమకొండ, ఆగస్టు 15 : జిల్లా సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం హనుమకొండ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 78వ స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి హాజరై పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా మన దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. సర్కారు విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నదన్నారు. ఆరోగ్యశ్రీ వైద్య సహాయ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచిందని, డిసెంబర్ 9వ తేదీ నుంచి ఇప్పటివరకు జిల్లాలో 30,642 మంది ఈ పథకం ద్వారా వైద్య సేవలను అందుకున్నారని తెలిపారు. రైతాంగం సంక్షేమమే ధ్యేయంగా రూ.2 లక్షల రుణ మాఫీ అమలు చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు 37,209 మందికి రూ. 250.18 కోట్లు జమచేశామన్నారు. రైతు బీమా కింద 419 మంది రైతు కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున అందించామన్నారు. 14 మండలాల్లోని ఒక్కో రైతు వేదికలో మొత్తం రూ.45 లక్షలతో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో 171 ప్రాంతాలకు 416 ఆర్టీసీ సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 3.34 కోట్ల మంది మహిళా ప్రయాణికులు లబ్ధి పొందారన్నారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్‌లో భాగంగా రూ. 5 కోట్ల 82 లక్షలను సబ్సిడీ కింద ఖర్చు చేశామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అలాగే హనుమకొండ ప్రభుత్వ మెటర్నిటీ దవాఖానలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని 2023 డిసెంబర్ 9న లాంఛనంగా ప్రారంభించామన్నారు. జిల్లాలో ఐదు ప్రభుత్వ, 37 ప్రైవేట్ హాస్పిటల్స్‌లో ఈ పథకం అమలవుతుందన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 383 పాఠశాలల్లో రూ.15 కోట్ల 22 లక్షల విలువైన పనులు చేపట్టినట్లు తెలిపారు. 34,161 మంది విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం అందించామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 3 వేల ఎకరాల్లో పామాయిల్ తోటలు పెంచే లక్ష్యానికి గాను ఇప్పటి వరకు 288 మంది రైతులకు 811 ఎకరాల్లో పరిపాలనా అనుమతులు మంజూరు చేశామన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో 19.70 లక్షల పనిదినాల లక్ష్యానికి 17.75 లక్షల పనిదినాలు కల్పించి రూ.42 కోట్ల 71 లక్షలను కూలీలకు అందించామన్నారు. జిల్లాలో చేయూత పెన్షన్ పథకం కింద ప్రతి నెలా 24.40 కోట్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. బ్యాంకు లింకేజీ కింద 1435 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.161.83 కోట్లు అందించామని, స్త్రీనిధి కింద 1,279 మందికి రూ.1,161 లక్షలు రుణ సహాయం చేసినట్లు తెలిపారు. అలాగే మెప్మా ఆధ్వర్యంలో 208 సంఘాలకు రూ.24 కోట్ల 26 లక్షలను వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు అందించామన్నారు. కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్ ప్రారంభించామని తెలిపారు. గ్రేటర్ విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు 2024-25 సంవత్సరానికి రూ.483.05 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. భద్రకాళీ మాడ వీధుల నిర్మాణం, వరంగల్ బస్‌స్టేషన్ పునఃనిర్మాణం, రూ. 250 కోట్లతో నాయుడు పెట్రోల్ పంపు నుంచి ఎనుమాముల మార్కెట్ వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, ఉనికిచెర్లలో 135 ఎకరాల్లో మోడల్ అవుట్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నగరంలో స్మార్ట్ సిటీ కింద రూ. 944.67 కోట్లతో 106 పనులు చేపట్టామని, దీనిలో రూ.411.96 కోట్లతో 49 పనులు పూర్తి చేశామని, రూ.413 కోట్లతో చేపట్టిన 36 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారులను విస్తరించనున్నట్లు చెప్పారు. ఆ పనులు కొనసాగుతున్నాయన్నారు. జిల్లాలో పరిశ్రమలు స్థాపించేందుకు అవసరమైన అనుమతులను 30 రోజుల్లో ఇస్తామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 18 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని మంత్రి తెలిపారు. రూ.25.87 కోట్ల పెట్టుబడితో 229 మంది ఉపాధి పొందనున్నారని పేర్కొన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలం వంగరలో రూ.11 కోట్ల నిధులతో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విజ్ఞానవేదిక అభివృద్ధి పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. జిల్లాలో 67,178 వ్యవసాయ బావులు ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం 590 ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. 1,02,751 మంది వినియోగదారులు గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పైలట్ ప్రాజెక్టు పథకం కింద మినీ డెయిరీ పథకం బ్యాంకు లింకేజీతో ఆత్మకూరు, దామెర మండలాల్లో 176 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. వనమహోత్సవం కార్యక్రమం ద్వారా జిల్లాలో 2024 సంవత్సరానికి గాను 17 లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా వివిధ రకాల 14 లక్షల మొక్కలను నాటామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గంలో 3,500 గృహాలు నిర్మిస్తామని తెలిపారు. ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిశోర్ ఝా, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు. కాగా, పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

జెండా ఎగురవేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

వీరుల త్యాగంతోనే దేశానికి స్వేచ్ఛ

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, ఆగస్టు 15 : బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహానుభావులు వారి ప్రాణాలను త్యాగం చేశారన్నారు. నాటి ఉద్యమ వీరుల త్యాగ ఫలితంగానే అందరం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని చెప్పారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమాన్ని కేసీఆర్ గాంధీజీ చూపిన అహింసా మార్గంలోనే నడిపారని తెలిపారు.

జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

కలెక్టరేట్‌లో జెండా ఎగురవేసిన కలెక్టర్

హనుమకొండ, ఆగస్టు 15 : సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ప్రావీణ్య గురువారం జాతీయ పతాకావిష్కరణ గావించారు. అంతకు ముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి గణేశ్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి విద్యాలత పాల్గొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో చైర్మన్ విజయ్ చందర్ రెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేశారు.

జెండాకు వందనం చేస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

ఎన్పీడీసీఎల్‌లో..

హనుమకొండ సబర్బన్ : ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగుల అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. వినియోగదారులకు మరింత చేరువై సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రజావాణి పెట్టామని, రిసెప్షన్ డెస్క్ కూడా అందుబాటులో ఉంచామని చెప్పారు. గృహజ్యోతి పథకం కింద 22లక్షల మంది వినియోగదారులు లబ్ధి పొందుతున్నారన్నారు. సరఫరాలో సమస్యలు తలెత్తినప్పుడు విద్యుత్ సరఫరా అందించేందుకు 33/11 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మెరుగైన సేవలందించి 250మందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ హెచ్ఆర్‌డీ అశోక్‌కుమార్, సదర్ లాల్, మధుసూదన్, ఇన్‌చార్జి ఫైనాన్స్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

9,506 మందికి రుణమాఫీ

- బ్యాంకులకు చేరని జాబితా
- రుణాలపై సందిగ్ధం
- అయోమయంలో అన్నదాతలు

హనుమకొండ సబర్బన్, ఆగస్టు 15 : మూడో విడుత రైతు రుణమాఫీ పథకంపై అన్నదాతల్లో అయోమయం నెలకొంది. మొదటి, రెండో దశల్లో ముందస్తుగానే రైతుల జాబితా విడుదల చేసిన ప్రభుత్వం మూడో దశ జాబితా ప్రకటనలో మాత్రం గోప్యత పాటించడం అనుమానాలకు తావిస్తోంది. ఖమ్మం జిల్లాలో జరిగిన కార్యక్రమంలో రూ.2 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినప్పటికీ ఆయా జిల్లాల్లోని వ్యవసాయాధికారులకు అర్హుల జాబితా అందదు. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి మాత్రం కేవలం జిల్లాలో ఎంత మంద రైతులకు మాఫీ అయిందనే లెక్కలు మాత్రం విడుదల చేశారు. ఈ ప్రకారం జిల్లాలో 7,451 కుటుంబాల్లో 9,506 మంది రైతులకు రూ.122.40 కోట్లు మాఫీ అయినట్లుగా గణాంకాలు విడుదల చేశారు. అయితే రైతుల పేర్లు విడుదల చేయక పోవడంపై అయోమయం నెలకొంది.

కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

క్యూ కాంప్లెక్స్ కోసం స్థల పరిశీలన

ఐనవోలు, ఆగస్టు 15 : మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అధునాతన క్యూ కాంపెక్స్ నిర్మాణం కోసం గురువారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్ కనకదుర్గారావు, సహాయ ఇంజినీర్ వరుణ్, వీర చందర్, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావుతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. క్యూ కాంపెక్స్ నిర్మాణం కోసం ప్రణాళికలు తయారు చేయనున్నారు. ఎల్లమ్మతల్లి దేవాలయం, కల్యాణ కట్ట నిర్మాణం కోసం కూడా ఎస్ఈ స్థలాన్ని పరిశీలించినట్లు ఈవో తెలిపారు.

వైన్‌షాప్ ఓనర్ల కక్కుర్తి

- నిబంధనలు ఉల్లంఘన
- బెల్ట్‌షాప్‌ల ద్వారా విక్రయాలు
- పెద్ద మొత్తంలో మద్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

సుబేదారి, ఆగస్టు 15 : స్వాతంత్ర్య దినోత్సవం రోజు కూడా కొందరు వైన్‌షాప్‌ల యజమానులు కక్కుర్తి బుద్ధి చాటుకున్నారు. ఏటా ఆగస్టు 15న వైన్స్ మూసివేస్తారు. కానీ వరంగల్ నగరంలో కొందరు మద్యం షాప్‌ల ఓనర్లు బుధవారం షాప్‌లను మూసినట్టే మూసి.. తెరవెనుక బెల్ట్‌షాప్ ద్వారా విక్రయాలకు పాల్పడి అడ్డంగా పోలీసులకు దొరికిపోయారు. కమిషనరేట్ పరిధిలో సుమారు రూ.4లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. మిల్స్‌కాలనీ పరిధిలో శివ వైన్స్ ఓనర్ శాకరాసికుంటలో బెల్ట్‌షాప్ నిర్వాహకుడు ఎనగందుల రాజుతో కుమ్మక్కై అధిక ధరలకు మద్యం విక్రయిస్తుండగా రూ.2లక్షల86వేల విలువైన మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. వడ్డేపల్లిలోని బెల్ట్ షాప్ నుంచి సుబేదారి పార్క్‌లైన్ వైన్ షాప్‌కు చెందిన రూ.50వేల విలువైన మద్యం బాటిళ్లు, వడ్డెపల్లి ముదిరాజ్‌కాలనీలోని బెల్ట్‌షాప్ నుంచి మరో రూ.77,830 విలువైన మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

బీఆర్ఎస్ కార్యకర్తలను కాపాడుకుంటా : చల్లా

ఆత్మకూరు/దామెర, ఆగస్టు 15 : పరకాల నియోజకవర్గంలోని ప్రతి బీఆర్ఎస్ కార్యకర్తను కాపాడుకుంటానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గూడెప్పాడ్ గ్రామానికి చెందిన ఓరుగంటి సమ్మక్క, బలభద్ర భవాని, అక్కంపేట గ్రామానికి చెందిన ఎరుకల రాజు, జన్ను ఆనంద్, కడుదుల సంపత్, పెద్దాపురం గ్రామానికి చెందిన మోతె సమ్మయ్య, ధర్మపురి ప్రవీణ్‌గౌడ్‌లు ఇటీవల మృతి చెందగా, గురువారం వీరి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, నాయకులు వేముల నవీన్, సావురే రాజేశ్వర్‌రావు, నాగనబోయిన సాంబయ్య, వేల్పుల గణేశ్, కక్కెర్ల సుధాకర్ ఉన్నారు. దామెర మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన రాగిడి మల్లమ్మ మృతి చెందగా, ఆమె పార్థివదేహంపై మాజీ ఎమ్మెల్యే చల్లా పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గండు రామకృష్ణ, గ్రామ అధ్యక్షుడు కునాటి సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు చైన్‌స్నాచింగ్ నిందితుల అరెస్ట్ చూపిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

సుబేదారి, ఆగస్టు 15 : ఇద్దరు చైన్ స్నాచర్స్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సుబేదారి పోలీసు స్టేషన్‌లో హనుమకొండ ఏసీపీ కే దేవెందర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. లష్కర్‌బజార్‌కు చెందిన అడ్డూరి సాయికుమార్, వరంగల్ చార్‌బౌళికి చెందిన మారోజు ప్రేమ్‌కృష్ణ వరంగల్ పిన్నావారి వీధిలో బంగారు అభరణాల తయారీ షాప్‌లో పనిచేస్తూ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డారు. డబ్బుల కోసం చోరీలు చేయడం ప్రారంభించారు. హనుమకొండ శ్రీనగర్ కాలనీలో మహిళ నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో వీరు బైక్‌పై వచ్చి చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. దర్యాప్తు చేసి ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి, సొత్తు రికవరీ చేశామని ఏసీపీ తెలిపారు.

విద్యార్థులకు పారితోషికాలు అందజేత

శాయంపేట, ఆగస్టు 15 : శాయంపేట జిల్లా పరిషత్ బాలుర, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులకు గురువారం దాతలు నగదు పారితోషికాలు అందజేశారు. ధనుష్‌కు రూ.5వేలను మొదటి బహుమతిగా బాసాని సుదర్శనం జ్ఞాపకార్థం ఆయన తమ్ముడు బాసాని సుబ్రహ్మణ్యం అందజేశారు. చరణ్‌కు రూ.4వేలను దిడ్డి రమేశ్, తృతీయ బహుమతిని హర్షిత్‌కు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు సామల వీరేశం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు భిక్షపతి రూ.3వేలను అందజేశారు. కే వర్షితకు ప్రథమ బహుమతిగా సుబ్రహ్మణ్యం రూ.5వేలు, భానుశ్రీకి రూ.4వేలు, హరికకు రూ.3వేలను రాధమ్మ జ్ఞాపకార్థం భిక్షపతి అందజేశారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్లు శ్రీనివాస్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు అందజేస్తున్న దాతలు

గంటలో వస్తానని గాయబ్ అయిండు..

- ఆచూకీ తెలుపాలని భర్త ఇంటి ఎదుట భార్య పోరాటం
- మద్దతుగా నిలిచిన బీఆర్ఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు

రంజిత్ ఇంటి వద్ద ఫొటోలు చూపుతున్న చంద్రకళ, ఆమె కుటుంబసభ్యులు

భీమదేవరపల్లి, ఆగస్టు 15 : గంటలో వస్తానని, గాయబ్ అయ్యాడని.. తన భర్త బొల్లంపల్లి రంజిత్ ఆచూకీ తెలపాలంటూ అతడి ఇంటి ఎదుట భార్య చిడిపి చంద్రకళ ఆందోళనకు దిగిన ఘటన ముల్కనూరులో జరిగింది. బాధితురాలి కథనం ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం చిన్నకొండేపూడి గ్రామానికి చెందిన చిడిపి చంద్రకళ రాజమండ్రి పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్నది. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు గ్రామానికి చెందిన బొల్లంపల్లి రంజిత్ అదే హాస్పిటల్‌లో రిసెప్షనిస్టుగా పనిచేశాడు. వీరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. దీంతో ఇరువురు ఆరేళ్లపాటు సహజీవనం చేశారు. మా అన్నయ్య పెళ్లి కాగానే.. నేను మీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని చంద్రకళ కుటుంబసభ్యులను రంజిత్ నమ్మబలికాడు. ఇంతలో రంజిత్ ఆస్పత్రిలో ఉద్యోగం వదిలి రాజమండ్రిలో ఓ పేపరు మిల్లులో పనికి చేరాడు. రంజిత్ అన్నయ్య వివాహం కాగానే అతడు మోహం చాటేశాడు. జూలై 9వ తేదీ నుంచి రంజిత్ కనిపించడం మానేశాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అనుమానం వచ్చి అతడి స్వగ్రామం ముల్కనూరుకు కుటుంబ సభ్యులతో వచ్చింది. రంజిత్ కుటుంబ సభ్యులే తమను విడగొడుతున్నారని బాధితురాలు చంద్రకళ విలపిస్తూ పేర్కొంది. 2018లో రాజమండ్రిలోని బ్రదర్ చర్చిలో తాను రంజిత్‌ను వివాహం చేసుకున్నట్లు ఆమె చెప్పింది. రంజిత్‌తో వివాహ బంధం కొనసాగించాలంటే అతడి కుటుంబసభ్యులు రూ. 50లక్షలు కట్నం డిమాండ్ చేస్తున్నారని కన్నీళ్లు పెట్టుకుంది. ఐదు రోజుల క్రితం ఇక్కడి జేఏసీ మండలాధ్యక్షుడు డేగల సారయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు మాట్ల వెంకటస్వామి, కండె రమేశ్, బీఆర్ఎస్ నాయకులు మాడుగుల అశోక్, కండె సుధాకర్‌తో కలిసి రంజిత్ ఇంటికి వస్తే తమకు అతని ఇంటిలోని ఒక రూములో షెల్టర్ ఇచ్చి రెండు రోజుల్లో రంజిత్‌ను తీసుకొస్తామని మాట ఇచ్చారని తెలిపింది. ఇప్పుడు రంజిత్ అచూకీ తెలియదంటున్నారని పేర్కొంది. రంజిత్ ఆచూకీ చెప్పేవరకు అతడి ఇంటి ముందు ఆందోళన విరమించేది లేదని తేల్చి చెప్పింది. చంద్రకళతో పాటు ఆమె అమ్మ చిడిపి వెంకాయమ్మ, మామయ్య జనకోటి బజ్జన్న, పిన్ని మన్నెల్లి బేబి, తమ్ముడు